

సోమశిలఆ లయంలోశి వపార్వతులకలా ్యణాన్నిని ర్వహిస్తున్నఅర్చకులు

# కల్యాణం.. కమనీయం

కొల్లాపూర్, మార్చి 9 : మహాశివరాత్రిని పురస్కరించుకొని శనివారం ఉదయం 11 గంటలకు సోమశిలలోని లలితాంబికాసోమేశ్వరస్వామి ఆలయ సముదాయంలో శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరిగింది. బ్రాహ్మణుల వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణాన్ని ఆలయకమిటీ చైర్మన్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు.



రథాన్ని లాగేందుకు పోటీపడుతున్న భక్తులు

# అలంపురం.. భక్తజన సంద్రం

అలంపూర్, మార్చి 9 : మహాశివరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయ ప్రాంగణం ఓం నమః శివాయ, హరహర మహాదేవ శంభో శంకర.. నామస్మరణలతో మార్మోగింది. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన రథంపై శివపార్వతులు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలో రథోత్సవం నిర్వహించిన అక్బర్‌పేట కాలనీ తేరు మైదానం భక్తజన సంద్రమైంది. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, పాలకమండలి సభ్యులు, చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

***హంసవాహనంపై ఆదిదంపతులు***

ఉత్సవాల్లో భాగంగా జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామిని శనివారం నంది, హంస వాహనాలపై ఊరేగించారు. కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పూలమాలలు, కొబ్బరికాయలు సమర్పించి దర్శించుకున్నారు.



హంసవాహనంపై ఊరేగుతున్న జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరసా ్వమి,అమ ్మవార్లు



మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డికి శనివారం బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బీ ఫారం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను నవీన్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

శ్రీశైల మల్లన్న రథోత్సవానికి భారీగా హాజరైన భక్తులు



# మనోరథ శోభితం..

- కిక్కిరిసిన శ్రీగిరి, రెండు లక్షల మందికిపైగా భక్తుల రాక
- నయనానందకరంగా తెప్పోత్సవం

# మల్లన్న రథోత్సవం



ఆలయపుష ్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం

శ్రీశైలం, మార్చి 9 : శ్రీశైల క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు అంబరాన్నంటాయి. ప్రధాన ఘట్టమైన రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన సుమారు రెండులక్షల మంది భక్తులతో పురవీధులు కిటకిటలాడాయి. భ్రమరాంబ, మల్లికార్జునుల కల్యాణోత్సవం అనంతరం స్వామి, అమ్మవార్లు రథంపై ఆసీనులై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. శనివారం సాయంత్రం ఈవో పెద్దిరాజు, ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో అశేష జనవాహిని మధ్య రథోత్సవం వైభవంగా సాగింది. ఆలయ ప్రాంగణం నుంచి భ్రామరీ సమేత మల్లికార్జునుడి ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకొచ్చి సంప్రదాయం ప్రకారం రథాంగపూజ, హోమం, రథాంగబలి కార్యక్రమాలు నిర్వహించి సాత్వికబలి సమర్పించారు. అలాగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు పుష్కరిణిలో తెప్పోత్సవం నయనానందకరంగా సాగింది. ఆధునిక సాంకేతికతతో కూడిన విద్యుద్దీపాలంకరణ, సౌండ్ సిస్టమ్, వాటర్ ఫౌంటేన్‌ల వద్ద యాత్రికులు సెల్ఫీలు దిగారు. అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక పూజలందుకున్న స్వామి, అమ్మవార్లను ఆలయ పుష్కరిణి వద్దకు తోడ్కొని రాగా పుష్పాలంకరణ చేసిన తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

## మల్లన్న సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి

భ్రమరాంబ, మల్లికార్జునస్వామివార్లను సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సందీప్ మెహతా దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఈవో పెద్దిరాజు, చైర్మన్ చక్రపాణిరెడ్డి, వేదపండితులు స్వాగతం పలికారు. స్వామివారి గర్భాలయంలో అభిషేకం, బిల్వార్చన, అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన చేసి హారతులు అందుకున్నారు. అనంతరం ప్రాకార మండపంలో వేదాశీర్వచనాలు వల్లించిన ప్రధానార్చకులు అభిషేక జల తీర్థప్రసాదాలను అందజేశారు.



సందీప్ మెహతా దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న శ్రీశైలం ఈవో, చైర్మన్

# మహాశివలింగం

- దక్షిణ భారతదేశంలోనే తొలిసారి 30అ డుగులలో భారీ రుద్రాక్ష శివలింగం ఏర్పాటు
- భక్తులకు 20 లక్షల రుద్రాక్షలు ఉచితంగా పంపిణీ

శ్రీశైలం, మార్చి 9 : శ్రీశైలంలో పరమశివుడికి ప్రీతికరమైన రుద్రాక్ష సేవ చేసేందుకు 30 అడుగుల పంచముఖి రుద్రాక్ష సహిత మహా శివలింగాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. సుమారు 20 లక్షల రుద్రాక్షలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కామ్యరుద్రాక్ష ఆధ్యాత్మిక సేవాసమితి వ్యవస్థాపకుడు పగడాల మల్లికార్జునరావు తెలిపారు. శివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రుద్రాక్ష మహాలింగానికి పూజలు చేసిన అనంతరం శివభక్తులకు దర్శనం కల్పించి రుద్రాక్ష ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని తొలిసారి రుద్రాక్షలతో 30 అడుగుల శివలింగాన్ని యాత్రికులు దర్శించుకున్న అనంతరం నేపాల్ నుంచి తీసుకొచ్చిన పంచముఖి రుద్రాక్షలను భక్తులకు ప్రసాదంగా అందించామన్నారు. వీటిని ఆదివారం వరకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన శ్రీశైల ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



30అ డుగులరు ద్రాక్షశి వలింగం

# మన్యంకొండకు భక్తుల తాకిడి

పాలమూరు, మార్చి 9 : మహబూబ్‌నగర్ రూరల్ మండలం మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి నెలకొన్నది. భక్తులు తలనీలాలు సమర్పించి పుష్కరిణిలో స్నానం చేసి స్వామివారిని దర్శించుకోవడానికి క్యూలో బారులుదీరారు. రాత్రి వేళ స్వామివారికి శేష వాహన సేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈవో శ్రీనివాసరాజు, పర్యవేక్షకులు నిత్యానందచారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశుడిద ర్శనానికిబా రులుదీరినభ క్తులు

# డీసీఎల్‌లో మెరిసిన హంసిని

- జాతీయస్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన కందనూలు విద్యార్థిని

నాగర్‌కర్నూల్, మార్చి 9 : జాతీయస్థాయిలో నిర్వహించిన దీపిక చిల్డ్రన్ లీగ్ (డీసీఎల్) స్కాలర్‌షిప్ పరీక్షల్లో జిల్లా కేంద్రానికి చెందిన సూగూరు నరేశ్ కూతురు హంసిని మెరిసింది. పట్టణంలోని స్థానిక గీతాంజలి పాఠశాలలో హంసిని 7వ తరగతి చదువుతున్నది. గత నెల 10న డీసీఎల్ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించగా హంసిని జాతీయస్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, డీసీఎల్ నిర్వాహకుల చేతుల మీదుగా హంసిని మెడల్‌తోపాటు నగదు పురస్కారాన్ని అందుకున్నది. మరిన్ని కాంపిటేటీవ్ పరీక్షల్లో ప్రతిభ చాటి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన హంసినిని పలువురు అభినందించగా ప్రిన్సిపాల్ రాయ్‌జోసెఫ్, అధ్యాపకులు హ ర్షం వ్యక్తం చేశారు.




అవార్డుఅం దుకుంటున్నహం సిని

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదే..

- చిత్తశుద్ధి లేని హామీలతో మోసం చేసిన కాంగ్రెస్
- మాజీమ ంత్రినిరం జన్‌రెడ్డి



ముఖ్య నాయకులు,కా ర్యకర్తలతో మాట్లాడుతున్నమా జీమ ంత్రిని రంజన్‌రెడ్డి

వనపర్తి, మార్చి 9 : రానున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మనదేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ ప్రజల తీర్పు భిన్నంగా ఉండబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో పార్లమెంట్ ఎన్నికల్లో చేపట్టాల్సిన విధివిధానాలపై వనపర్తి మండల బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో నిరంజన్‌రెడ్డి సమావేశమై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి లేని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి తిరకాసులు పెడుతూ కాలయాపన చేస్తున్న విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. ఈ పదేండ్లలో కేసీఆర్ రైతులకు సాగునీటిని ఏప్రిల్ వరకు అందిస్తే కాంగ్రెసోళ్లు గెలిచిన మరుసటి రోజు నుంచే కాల్వ నీళ్లు బంద్ పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు యాసంగి పంటలకు నీరులేక అన్నదాతలు పశువులకు వదిలేస్తున్నారన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనని ప్రజలకు ఇప్పటికే అర్థమైందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఏ కార్యకర్తకూ అన్యాయం చేయలేదని తేల్చి చెప్పారు. అవకాశవాద రాజకీయాలు చేసేవారే పార్టీని వీడుతున్నారని, అటువంటి వారితో ఎప్పటికైనా పార్టీకి నష్టమేనని స్పష్టం చేశారు. పార్టీలో ఉన్న నాయకుల మీద తనకు పూర్తి విశ్వాసం ఉందని.. అంతే నమ్మకంతో వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కలిసి కసిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కష్టకాలంలో తనతో కలిసి నడిచిన వాళ్లకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేసిన పనులే తప్పా కాంగ్రెసోళ్లు వచ్చాక చేసిందేమీ లేదని.. ఇంకా పూర్తి కావాల్సిన పనుల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైందని, ఈ రెండు నెలలు ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మండల అధ్యక్షుడు మాణిక్యం, అధికార ప్రతినిధి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ఎంపీటీసీలు రంగారెడ్డి, ధర్మానాయక్, ధర్మశాస్త్రి, సీనియర్ నాయకులు లక్ష్మయ్య, కురుమూర్తియాదవ్, రాములు యాదవ్, చెన్నరాములు, వెంకటేశ్, చంద్రశేఖర్‌నాయక్, విజయ్, శ్రీనివాసులు, రాజేశ్వరి పాల్గొన్నారు.

# ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుదాం

- గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- రేపు బీఆర్‌ఎస్ సమావేశం
- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్నమా జీఎ మ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, మార్చి 9 : తెలంగాణ ఏర్పాటుకు చేసిన పోరాటం, ముఖ్యమంత్రిగా రాష్ట్రాభివృద్ధికి కేసీఆర్ చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోతాయని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అన్నాసాగర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గంలోని ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో శనివారం సమావేశమై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో రైతుబంధు, రుణమాఫీ ఇంతవరకు అమలు చేయలేకపోయాడన్నారు. నియోజకవర్గంలో దాదాపు 85శాతం ఎంపీటీసీలు, 100 శాతం జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు గులాబీ పార్టీ వాళ్లే ఉన్నారని, వీరంతా బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థికే ఓటు వేయాలని సూచించారు. ఈ ఐదేండ్ల కాలంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతామన్నారు. 11న జిల్లా కేంద్రంలోని జేజేఆర్ గార్డెన్స్‌లో పార్లమెంట్‌స్థాయి సమావేశం ఉంటుందని, నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీలు శేఖర్‌రెడ్డి, మౌనిక, హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీలు ఇంద్రయ్యాసాగర్, అన్నపూర్ణ, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహయాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ రెఫరీగా

# నల్లమల వాసి



బాబూనాయక్

అచ్చంపేట రూరల్, మార్చి 9 : మండలంలోని దేవులతండా పంచాయతీకి చెందిన సభావట్ బాబూనాయక్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ రెఫరీగా ఎంపికైనట్లు ఉమ్మడి మహబూబ్‌నగర్ బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌గౌడ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10 నుంచి 14వరకు పాట్నాలో జరుగనున్న పోటీలకు బాబూనాయక్ రెఫరీగా ఎంపికైనట్లు తెలిపారు. కాగా, బాబూనాయక్ టార్గెట్‌బాల్ జాతీయ క్రీడాకారుడిగా కొనసాగుతున్నారు.

# వరి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- గతంలో యాసంగి సాగు సంబురంగా చేసుకున్నం..
- నేడు భూగర్భజలాలు అడుగంటి అవస్థలు
- ఎకరాకు రూ.25వేల ఇన్సూరెన్స్ చేయించాలి

కల్వకుర్తి రూరల్, మార్చి 9 : కల్వకుర్తి మండలంలో వరి పంటను సాగు చేస్తున్న రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని పీఏసీసీఎస్ వైస్ చైర్మన్, తర్నికల్ రైతులు కోరుతున్నారు. శనివారం తర్నికల్‌లో వారు సమావేశమై మాట్లాడారు. గ్రామంలో దాదాపు 300కు పైగా ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నామని, ఓ వైపు తెగుళ్లు, మరోవైపు భూగర్భజలాలు అడుగంటి పైరుకు నీరందక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కెఎల్ఐ కాల్వల ద్వారా ఫిబ్రవరి వరకు సాగునీరివ్వగా యాసంగి సాగు సంబురంగా చేసుకున్నామని రైతులు ఆంజనేయులు, జంగయ్య, ఈశ్వర్‌రెడ్డితోపాటు పలువురు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలతో సర్వే చేయించి సాగు చేస్తున్న వారికి ఎకరాకు రూ.25 వేల ఇన్సూరెన్స్ చేయించి పంట నష్టపోయే రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.